క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



అలీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న చలపతిరావు

కొడవలూరు: ప్రముఖ హాస్యనటుడు అలీని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన ఆయన్ను చలపతిరావు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

మనుబోలు తహసీల్దార్‌గా రమాదేవి



మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

మనుబోలు: మనుబోలు తహసీల్దార్‌గా రమాదేవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా ఉన్న వెంకటసుబ్బయ్య బదిలీపై వెళ్లడంతో సైదాపురం మండలంలో పనిచేస్తున్న రమాదేవి బదిలీపై మనుబోలుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. రెవెన్యూ, భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అలాగే డిప్యూటీ తహసీల్దార్‌గా ప్రదీప్‌కుమార్, మండల వ్యవసాయాధికారిగా వెంకటకృష్ణయ్య బాధ్యతలు చేపట్టారు.

ఏకలవ్య జయంతిని అధికారికంగా జరపాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నెల్లూరు రూరల్: ఎరుకుల ఆరాధ్య దైవమైన ఏకలవ్య జయంతిని అధికారికంగా ప్రకటించి ప్రభుత్వం నిర్వహించాలని ఏపీ ఎరుకుల సేవా సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షుడు నల్లగొండ్ల శివ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంత్‌సేవాలాల్ మహరాజ్, వాల్మీకి జయంతిని ప్రభుత్వ అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. అదే విధంగా ఏకలవ్యుని జయంతిని అధికారికంగా ప్రకటించాలని విన్నవించారు. దీనిపై కలెక్టర్ స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండి బుచ్చయ్య, జిల్లా గౌరవాధ్యక్షుడు కట్టా రమణయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు నల్లగొండ్ల వెంకయ్య, జాయింట్ సెక్రటరీ కంప శ్యామ్, కట్ట నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అతిసార వ్యాధిని అరికడదాం

- డీఎంహెచ్ఓ సుజాత



వాల్‌పోస్టర్లను ప్రదర్శిస్తున్న అధికారులు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో అతిసార (డయేరియా) వ్యాధిని అరికడదామని డీఎంహెచ్ఓ సుజాత పేర్కొన్నారు. కుటుంబ, ఆరోగ్య సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ నుంచి వచ్చే నెలాఖరు వరకు నిర్వహించనున్న స్టాప్ డయేరియా కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లు, బ్యానర్లను సోమవారం సంతపేటలోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్ఓ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అతిసార వల్ల శరీరంలోని లవణాలతో కూడిన నీరు వాంతులు, విరేచనాల ద్వారా బయటకు పోతుందన్నారు. అలాంటి సమయంలో ద్రవ పదార్థాలు తీసుకోవాలన్నారు. లేకుంటే కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ఒక్కోదఫా ప్రాణాంతకమయ్యే ప్రమాదం ఉందన్నారు. అతిసారకు గురికాకుండా ఉండాలంటే రక్షిత మంచినీరు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ వ్యాధి నివారణకు ప్రస్తుత కాలంలో టీకాలు వచ్చాయన్నారు. వాటిని పిల్లలకు సకాలంలో వేయించాలన్నారు. అన్ని పీహెచ్‌సీల డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ, డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరి, డీపీఎంఓ డాక్టర్ రమేష్, డెమో అధికారి కనకరత్నం, డీసీహెచ్ఎంఓ మంజుల తదితరులు పాల్గొన్నారు.

సగం పైకప్పుతో నిరుపయోగమే..

- టపాతోపు అండర్ పాస్‌పై పూర్తిగా నిర్మించని పైకప్పు
- వర్షాకాలంలో రాకపోకల బంద్



అండర్ పాస్‌కు మరో వైపు కూడా కొంత భాగమే జరిగిన నిర్మాణం

కొడవలూరు : మండలంలోని టపాతోపు వద్ద రూ.11 కోట్లతో పూర్తిచేసిన అండర్ పాస్‌పై అదనపు నిధులు వెచ్చించి పైకప్పు నిర్మించారు. దీనిని అండర్ బ్రిడ్జి పొడవునా కాకుండా సగభాగమే నిర్మించారు. దీనివల్ల లాభం కన్నా నష్టమే ఎక్కువగా ఉంది. వర్షాకాలంలో నెలల తరబడి రాకపోకలు నిలిచిపోతుండగా, వేసవిలోనూ నీడన నిలిచే అవకాశం లేకుండాపోయింది. గతేడాది ఫిబ్రవరి 26న దేశవ్యాప్తంగా 1500 ఫ్లైఓవర్‌లు, అండర్ పాస్‌లను ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఆ సమయంలోనే టపాతోపు వద్ద అండర్ పాస్‌ను కూడా ప్రారంభించారు. ఆ సమయానికి పైకప్పు నిర్మాణం జరగలేదు. తరువాత అదనపు నిధులతో అండర్ పాస్‌కు పైకప్పు నిర్మాణం చేపట్టారు. అయితే దీనిని అండర్ పాస్ పొడవునా పూర్తిగా నిర్మించకుండా కేవలం కొంత భాగం మాత్రమే నిర్మించారు. దీనివల్ల ఎలాంటి ప్రయోజనం లేకుండాపోయింది.

ఏ సీజన్‌లోనూ ప్రయోజనం నిల్

అండర్‌పాస్‌కు కొంత భాగం మాత్రమే పైకప్పు నిర్మించడం వల్ల వర్షపునీరు యథావిధిగా అండర్ బ్రిడ్జిలో పడుతున్నాయి. ఈ వర్షపునీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో నెలల తరబడి రాకపోకలు నిలిచిపోతున్నాయి. గత వర్షాకాలంలోనూ ఇదే జరిగింది. వేసవిలో కూడా బ్రిడ్జి మధ్యలో మాత్రమే పైకప్పు నిర్మించి ఉండడం వల్ల కొన్ని వాహనాలు నీడన నిలుస్తున్నాయి. ఇది మలుపు కావడం వల్ల వచ్చే పోయే వాహనాలు కన్పించక ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఎండకు బ్రిడ్జి కింద నిలిచే అవకాశం లేకుండాపోయింది.

పూర్తిగా నిర్మిస్తే ఎంతో ప్రయోజనం

పైకప్పును బ్రిడ్జి పొడవునా నిర్మిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది. వర్షాకాలంలో నీరు బ్రిడ్జి లోనికి వెళ్లకుండా బయట పడతాయి. అలా బయటపడిన నీటిని పక్కనే ఉన్న మలిదేవి డ్రెయిన్‌లోనికి పంపడం చేయవచ్చు. బ్రిడ్జికిరువైపులా ఇలాగే చేస్తే వెసులుబాటు ఉంటుంది. అదే చేస్తారని అందరూ భావించారు. కానీ అలా కాకుండా కొంత పైకప్పు నిర్మించి వదిలేశారు.



టపాతోపు అండర్‌పాస్‌పై కొంతే జరిగిన పైకప్పు నిర్మాణం



వర్షం వల్ల రోజుల తరబడి నిలిచిన నీరు (ఫైల్)

పూర్తిగా నిర్మిస్తేనే ఉపయోగం



టపాతోపు అండర్ పాస్‌కు పూర్తిస్థాయిలో పైకప్పు నిర్మిస్తే వర్షాకాలంలోనూ నిశ్చింతగా రాకపోకలు సాగుతాయి. కానీ అలా చేయకుండా కొంతే నిర్మించి వదిలేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం కన్పించడం లేదు. సగం మాత్రమే నిర్మించి ఎందుకు వదిలేశారో తెలియడం లేదు.

– ఎం.ప్రసన్నకుమార్, నార్తురాజుపాళెం

పూర్తిగా నిర్మించేలా చర్యలు తీసుకోవాలి



టపాతోపు అండర్ పాస్‌కు నిర్మించిన పైకప్పును పూర్తిస్థాయిలో నిర్మించేలా రైల్వే శాఖ చర్యలు తీసుకోవాలి. ఇక్కడ మలిదేవి డ్రెయిన్ అందుబాటులో ఉన్నందున బ్రిడ్జి బయట పడే వర్షపు నీటిని ఆ కాలువ ద్వారా సముద్రంలోనికి పంపే అవకాశం ఉంది. ఇంతటి వెసులుబాటు ఉన్నప్పటికీ సగభాగం మాత్రమే నిర్మించి వదిలేయడం విడ్డూరంగా ఉంది. రైల్వే ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని పైకప్పును పూర్తి చేసి వర్షాకాలంలోనూ నిశ్చింతగా రాకపోకలు సాగేలా చర్యలు తీసుకోవాలి.

– కె.రమేష్, కొడవలూరు

నేడు ఆంజనేయస్వామికి విశేష పూజలు

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు రెడ్డిజన సేవా సంఘం వారు సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు ఆకుపూజ, మధ్యాహ్నం వేలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం స్వామికి పల్లకిసేవ, యువకులు హనుమాన్ చాలీసా ఆలపిస్తారన్నారు. గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాల్సిందిగా కోరారు.

బస్టాండ్‌ను ఆధునికీకరిస్తాం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను త్వరలో ఆధునికీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని ఏపీఎస్‌ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బస్టాండ్‌లోపల సీసీరోడ్లు, ప్రయాణికులు కూర్చునేందుకు అధునాతన కుర్చీలు తదితరాలను ఏర్పాటు చేస్తామని వివరించారు. ఆయన వెంట ఆర్టీసీ డీఎం మురళీకృష్ణ, పలువురు బీజేపీ నాయకులు ఉన్నారు.

అదే తీరు.. సమాచారం కరువు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని నగర పంచాయతీ 20వ వార్డులో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సోమవారం పర్యటించారు. రూ.10 లక్షలతో డ్రెయిన్ల పనులకు శంకుస్థాపన చేశారు. అయితే ఆమె వస్తున్న విషయం టీడీపీ నాయకులకే తెలియకపోవడం విశేషం. యథావిధిగా మీడియాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. ఈ విషయమై బుచ్చిరెడ్డిపాళెం టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసులును వివరణ కోరగా.. ఎమ్మెల్యే వస్తున్న విషయం తనకు తెలియదని, కొన్ని నిముషాల ముందే ఎమ్మెల్యే కార్యాలయం నుంచి సమాచారం అందింది అని వివరించారు.

తమనూ అర్హులుగా గుర్తించాలి

- 'తల్లికి వందనం'పై అంగన్‌వాడీల ఆవేదన



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కొడవలూరు: అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలను తల్లికి వందనం పథకానికి అర్హులుగా గుర్తించాలని వారు కొడవలూరులో డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట తల్లికి వందనం పథకానికి తమను అర్హులు చేయాలని కోరుతూ సోమవారం నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలసరి వేతనం రూ.12 వేల కంటే ఎక్కువ ఉందని చూపారని, వాస్తవానికి కార్యకర్తల నెలసరి వేతనం రూ.11.500లు మాత్రమేనన్నారు. గత ప్రభుత్వంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ కార్యకర్తలు, సహాయకులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తూ 2022వ సంవత్సరం ఏప్రిల్ 19న జీఓ కూడా ఇచ్చి ఉన్నారని తెలిపారు. కార్యకర్తల జీతం రూ.12 వేల కంటే తక్కువే ఉన్నందున తమను అర్హులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు యాస్మిన్, రమీజా తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యకర జీవనం



విడవలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

విడవలూరు: యోగాతో ఆరోగ్యకర జీవనం సాధ్యమని, మనిషి జీవతంలో యోగాను భాగం చేసుకోవాలని ప్రిన్సిపల్ బి.సుజాత కోరారు. స్థానిక పీఆర్‌ఆర్–వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సన్నాహక్ యోగా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంట్లోని పెద్దలకు కూడా యోగాపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎస్.మధు, ఇతర అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులకు శిక్షణ



కొడవలూరు: నార్తురాజుపాళెంలో గర్భిణులతో యోగాసనాలు

కొడవలూరు: నార్తురాజుపాళెంలోని హెల్త్ క్లినిక్(సబ్ సెంటర్)లో వైద్యశాఖ ఆధ్వర్యంలో గర్భిణులకు యోగాపై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీ సరోజ మాట్లాడుతూ గర్భిణులు సరైన యోగాసనాలు వేయడం ద్వారా ఎన్నో ఉపయోగాలున్నాయన్నారు. రక్త ప్రసరణ బేషుగ్గా ఉండడంతో పాటు బిడ్డ కదలికలు ఆరోగ్యకరంగా ఉంటాయన్నారు. సుఖ ప్రసవం ద్వారా ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనివ్వొచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఏ షఫీఉద్దీన్, ఏఎన్‌ఎం దీనమ్మ, ఆశా కార్యకర్త శాంతమ్మ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పితృ వియోగం



నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు

మనుబోలు : మండలంలోని వెంకన్నపాళెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆవుల మనోహర్‌రెడ్డి తండ్రి శ్రీనివాసులురెడ్డి ఆదివారం మరణించారు. ఈ క్రమంలో సోమవారం ఆయన భౌతికకాయానికి పార్టీ నాయకులు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, ముంగర రవీంధర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, దువ్వూరు సుధాకర్‌రెడ్డి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

కాంట్రాక్టర్లు గాలికొదిలేశారు



ఆగిపోయిన ఇళ్లను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

మనుబోలు: బేస్‌మెంట్ బిల్లులు చేసుకుని కాంట్రాక్టర్‌లు ఇళ్ల నిర్మాణాలను గాలికొదిలేశారని బీజేపీ నేత మిడతల రమేష్ ఆరోపించారు. మనుబోలు మండల కేంద్రంలోని హౌసింగ్ లేఅవుట్‌లో అసంపూర్తిగా ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలను ఆయన సోమవారం స్థానిక బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ లేఅవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలకు కేటాయించిన నిధులను కాంట్రాక్టర్‌లు కాజేసి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. చాలా ఇళ్ల నిర్మాణాలను బేస్‌మెంట్ స్థాయిలోనే గోడలు కూడా నిర్మించకుండా వదిలేశారని ఆరోపించారు. హౌసింగ్ అక్రమాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఆయన వెంట ఏఎంసీ డైరెక్టర్ బోలా శ్రీనివాసులు, బీజేపీ నాయకులు సుధాకర్, రాజశేఖర్, లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

అన్నదాత సుఖీభవకు ఈ-కేవైసీ తప్పనిసరి



పొదలకూరులో ఈ-కేవైసీ ప్రక్రియను పరిశీలిస్తున్న ఏఓ ప్రతాప్

పొదలకూరు: అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత సాధించిన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో వీహెచ్‌ఏల ద్వారా తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏఓ వి.ప్రతాప్ సూచించారు. ఈ మేరకు ఆమె పొదలకూరులో ఈ-కేవైసీ ప్రక్రియను సోమవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఆర్‌జీటీఎస్ వాలిడేషన్ తర్వాత 7,311 మంది రైతుల రికార్డులు మాత్రమే ఈకేవైసీకు రావడం జరిగిందన్నారు. ఈ పథకాన్ని రైతులకు మాత్రమే వర్తింపజేస్తామని, రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపన్ను చెల్లిస్తున్న వారికి పథకం వర్తించదన్నారు. అర్హత ఉండి తమ పేర్లు పోర్టల్‌లో చూపని రైతులకు తిరిగి సమయం ఇచ్చి అవకాశం కల్పిస్తామన్నారు. తిరస్కరించిన రైతుల జాబితాకు సంబంధించి కారణాలను తెలియజేస్తామన్నారు. ఈకేవైసీ రాష్ట్రంలో రైతులు ఎక్కడైనా చేయించుకునేందుకు అవకాశం ఉందన్నారు.

అర్హుల తుది జాబితాలను పరిశీలించుకోవాలి

కొడవలూరు: అన్నదాత సుఖీభవ పథకం 2025–26 సంవత్సరానికి సంబంధించి అర్హుల తుది జాబితాను రైతు సేవా కేంద్రాల్లో ప్రచురించినట్లు ఏఓ ఎస్.విజయలక్ష్మి తెలిపారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో వీఏఏలతో సోమవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుది జాబితాలో అర్హులుగా ఉన్న వారు వీఏఏలను సంప్రదించి విధిగా ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో వీఏఏలు విధిగా అందుబాటులో ఉండాలన్నారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఎవరైనా అర్హత ఉండి జాబితాలో పేరు లేదని భావిస్తే వీఏఏను సంప్రదించి వివరాలను సమర్పించాలన్నారు. అదేవిధంగా మంగళవారం నుంచి అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎరువులు, పచ్చిరొట్ట విత్తనాలకు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి పొందాలని సూచించారు. ఏఈఓ వెంకట్రావు, వీఏఏలు పాల్గొన్నారు.

3,747 మందికి..

ముత్తుకూరు(పొదలకూరు): ముత్తుకూరు మండలంలో 3,747 మంది రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులుగా ఉన్నారని ఏఓ జోత్స్నరాణి అన్నారు. మండల కేంద్రంలో అర్హులైన రైతుల ఈ-కేవైసీ ప్రక్రియను ఏఓ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 18వ తేదీలోగా పథకానికి అర్హులైన రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాల్సిందిగా పేర్కొన్నారు. అర్హత ఉండి పోర్టల్‌లో పేర్లు లేని రైతులకు తిరిగి అవకాశం ఇస్తామన్నారు.



ముత్తుకూరులో ఈ-కేవైసీ ప్రక్రియను పరిశీలిస్తున్న ఏఓ

2,179 మంది ఈ-కేవైసీ చేయించుకోవాలి

కోవూరు: అన్నదాత సుఖీభవకు మండలంలో 2,179 మంది రైతులు ఈ-కేవైసీకి చేయించుకోవాలని ఏడీఏ అనిత తెలిపారు. కోవూరు మండల కేంద్రంలోని ఏడీ కార్యాలయంలో రైతులు, వ్యవసాయ సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.



కొడవలూరు: మాట్లాడుతున్న ఏఓ విజయలక్ష్మి



కోవూరు: మాట్లాడుతున్న ఏడీఏ అనిత

కోడూరు బీచ్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి

తోటపల్లిగూడూరు: జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కోడూరు బీచ్ రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని పర్యాటకులు అల్లం సాగర్, బత్తల వెంకటేష్, గిరీష్‌కుమార్ కోరారు. ఈ మేరకు వారు కలెక్టర్ ఆనంద్‌కు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడి బీచ్‌తో పాటు వేళాంగణి మాత చర్చికి జిల్లాలో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. దీనివల్ల రోజూ వందల సంఖ్యలో పర్యాటకులు, భక్తులు విచ్చేస్తుంటారన్నారు. అయితే మహాలక్ష్మీపురం నుంచి కోడూరు బీచ్ వరకు రెండు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు అధ్వానంగా మారిపోయిందన్నారు. దీనిపై అధికారులు స్పందించి అస్తవ్యస్తంగా మారిన బీచ్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టి ఇబ్బందులను తొలగించాలన్నారు.

యథేచ్ఛగా ఇసుక రవాణా



భావనపాడు గ్రామంలో ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని కాగులపాడు పంచాయతీ భావనపాడు గ్రామంలో పెన్నానది నుంచి కొందరు అక్రమార్కులు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను యథేచ్ఛగా తరలిస్తూ రూ.లక్షలు గడిస్తున్నారు. గ్రామం నుంచి ప్రతిరోజు పదుల సంఖ్యలో ట్రాక్టర్లు ఇసుకలోడుతో వెళ్తున్నాయని గ్రామస్తులు సోమవారం తెలిపారు. మైనింగ్ అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు వారు వాపోయారు. కాగులపాడు పంచాయతీలోని ఓ నాయకుడి ప్రోద్బలంతో ఇసుక తరలిస్తున్నట్లు తెలుస్తోంది.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు రూరల్: జిల్లా ఉపాధి కార్యాలయం, నెల్లూరు జిల్లా శిక్షణా శాఖ ఆధ్వర్యంలో డొమస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, రిటైల్ సేల్స్ అసోసియేట్ కోర్సుల్లో మూడునెలల ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉపాధి అధికారి ఎం.వినయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు కోర్సుల్లో కలిపి 60 ఖాళీలు ఉన్నాయన్నారు. పదో తరగతి చదివి, 18 – 30 సంవత్సరాల మధ్య వయసున్న వారు అర్హులన్నారు. ఈనెల 24వ తేదీలోగా జిల్లా ఉపాధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 91608 88066, 80089 45840 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.